సాక్షి చిత్తూరు

బుధవారం । 6 । ఆగస్టు । 2025



బ్రహ్మోత్సవం..
కాణిపాకం బ్రహ్మోత్సవాలను బ్రహ్మాండంగా జరిపించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. - 10లో



కలలు కనండి
కలలు కనండి.. ప్రపంచం ఎదుర్కొంటున్న సవాళ్లపై పరిశోధనలు చేయండి అని గోదావరి రీఫైనరీస్ చైర్మన్ పిలుపునిచ్చారు. - 10లో



బాల్య వివాహాల కట్టడికి చర్యలు
అన్ని శాఖల సమన్వయంతో బాల్య వివాహాలు నిర్మూలించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ మణికంఠ పిలుపునిచ్చారు. - 10లో

న్యూస్‌రీల్

జిల్లా స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు

నగరి : జిల్లా స్థాయి సబ్ జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు నగరి మండలం, నాగరాజకుప్పం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎంపికయ్యారు. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి మహిళా జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో నాగరాజకుప్పం జెడ్పీహెచ్‌ఎస్‌లో 10వ తరగతి చదివే నికాస్, జ్యోష్న, 9వ తరగతి చదివే విమల్ ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని మంగళవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు పద్మనాభ రాజు, పీడీ గోపి, ఉపాధ్యాయులు అభినందించారు.

నేడు విద్యుత్ గ్రీవెన్స్

చిత్తూరు కార్పొరేషన్: విద్యుత్ సమస్యల పరిష్కారానికి బుధవారం విద్యుత్ గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. స్థానిక గాంధీ రోడ్డులోని ట్రాన్స్‌కో అర్బన్ ఈఈ కార్యాలయంలో ఉదయం 10.30కు కార్యక్రమం ప్రారంభమవుతుందని ఈఈ మునిచంద్ర తెలిపారు. చిత్తూరు, పూతలపట్టు వినియోగదారులు సమస్యలను రాతపూర్వకంగా ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు.

రూ.51.97 కోట్ల ఆదాయం

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల వారీగా గత నాలుగు నెలల్లో రూ.51.97 కోట్ల ఆదాయం వచ్చినట్లు జిల్లా రిజిస్ట్రార్ రమణమూర్తి తెలిపారు. ఏప్రిల్, మే, జూన్, జూలై నెలలకు గాను ఆదాయ లక్ష్యం రూ.73.08 కోట్లుగా నిర్దేశించగా అందులో రూ.51.97 కోట్లు వసూళ్లతో 72.2 శాతం లక్ష్యం చేరుకున్నట్లు వివరించారు. గత ఏడాది ఇదే ఈ నాలుగు నెలల్లో రూ.41.31 కోట్ల ఆదాయం వచ్చిందన్నారు. అప్పటితో పోలిస్తే ప్రస్తుతం 25 శాతం వృద్ధి సాధించామని వివరించారు.

దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో అర్హులైన విద్యార్థులు పీఎం రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డుకు దరఖాస్తులను చేసుకోవాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ 2025కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఆదర్శప్రాయమైన పనులు, జాతీయ స్థాయిలో క్రీడలు, సంఘసేవ, సైన్స్ అండ్ టెక్నాలజీ, పర్యావరణం, ఆర్ట్స్, లలితకళలు, వినూత్నమైన సేవల్లో అత్యుత్తమ ప్రతిభచాటిన 18 ఏళ్లలోపు విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. అర్హత, ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈనెల 15వ తేదీలోపు www.awards.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.


శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామికి స్నపన తిరుమంజనం నిర్వహిస్తున్న జీయర్ స్వాములు

● పవిత్రోత్సవం

తిరుమల శ్రీవారి ఆలయంలో మంగళవారం పవిత్రోత్సవాలు శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారికి సంపంగి ప్రాకారంలో వేడుకగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. వేద పండితులు పంచసూక్తాలను పఠించి పవిత్ర ప్రతిష్ట నిర్వహించారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లు మాడ వీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిచ్చారు.

- తిరుమల

అమ్మా..పాహిమాం



నగరి పట్టణ పరిధిలోని నేత్ర ప్రదాయణి దేశమ్మ దేవాలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆడినెల ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని ధనలక్ష్మి అలంకరణలో ముస్తాబు చేశారు. అమ్మవారిని రూ.10, రూ.500 నోట్లతో చూడ ముచ్చటగా అలంకరించారు. మొత్తం రూ.1.75 లక్షల నగదును అలంకరణకు ఉపయోగించారు.

- నగరి



పుట్టెడు కష్టాల్లో తల్లీబిడ్డ!

చిత్తూరు జిల్లాలోని ప్రభుత్వాస్పత్రులకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ కొత్త వాహనాలను సమకూర్చింది. నిర్వహణ బాధ్యతను అరబిందో సంస్థకు అప్పగించింది. ఐదేళ్ల కాలంలో తల్లీబిడ్డలను ఈ అంబులెన్స్‌ల్లో క్షేమంగా ఇళ్లకు తరలించేవారు. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక నిర్వహణ గాలికొదిలేసింది. వాహనాలు తరచూ మరమ్మతులకు గురవుతున్నా పట్టించుకోకుండా చేతులెత్తేసింది. తల్లీబిడ్డలు సకాలంలో ఇళ్లకు చేరలేక అవస్థలు పడాల్సి వస్తోంది. స్థోమత ఉన్న వారు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించగా.. ఆర్థిక స్థోమత లేని పేదలు తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ అంబులెన్స్‌ల కోసం ఎదురుచూడాల్సిన దుస్థితి ఏర్పడుతోంది.

- మూలకు చేరిన తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలు
- మరమ్మతులతో కునుకు తీస్తున్న వాహనాలు
- డ్రైవర్లు కరువు
- పట్టించుకోని ప్రభుత్వం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): జిల్లాలో 16 తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ అంబులెన్స్‌లు ఉన్నాయి. వీటిల్లో 8 వాహనాలు మూలకు చేరాయి. చిత్తూరు జిల్లా ఆస్పత్రి మాతా, శిశు విభాగానికి కేటాయించిన నాలుగు వాహనాలూ మరమ్మతులకు గురయ్యాయి. ఈ ఆస్పత్రిలో ప్రసవించిన మహిళలు ఇళ్లకు చేరేందుకు నానాఅవస్థలు పడుతున్నారు. నగరిలో -1, పలమనేరు -1, కుప్పంలో -2 మరమ్మతులకు గురయ్యాయి. ఇవీ నెలల తరబడి ఆస్పత్రిలోనే మూలుగుతున్నాయి.

మొరాయిస్తున్న వాహనాలు

వాహనాలు పూర్తిగా నిలిచిపోవడంతో పాటు ఇంజిన్ ఆయిల్, క్రౌన్ ఆయిల్, బ్యాటరీలు తరచూ మార్చపోవడంతో తరచూ మొరాయిస్తున్నాయి. టైర్లు అరిగిపోవడంతో పంక్చర్ అవుతున్నాయి. కనీసం వైపర్లు, లైట్లు కూడా పనిచేయని పరిస్థితి. ఈ విషయాన్ని సంస్థ యాజమాన్యానికి తెలియజేస్తున్నా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.


తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలు

ప్రైవేటు వాహనాలే దిక్కు

జిల్లాలో తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాల సేవలు అరకొరగా అందుతున్నాయి. సంస్థ, ప్రభుత్వం వాహన మరమ్మతు విషయంలో పట్టించుకోవడం లేదు. దీనికితోడు డ్రైవర్ల కొరత వేధిస్తోంది. ఒకే డ్రైవర్ రెండు బండ్లను తిప్పాల్సి వస్తోంది. తల్లులు.. అవస్థలు పడుతూ ఆటోల్లో ఇళ్లకు చేరుకున్నారు.

ఒకే వాహనంలో ఇద్దరు

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనంలో ఒక తల్లి, బిడ్డ వారి సాయంగా ఉన్న ఒకరిని మాత్రమే గమ్య స్థానానికి తీసుకెళ్లాలి. కొన్ని వాహనాలు మరమ్మతుకు గురవడంతో ఒకే రూట్‌లో వెళ్లాల్సిన ఇద్దరు తల్లులు, బిడ్డలను, వారి సహాయకులను తీసుకెళ్తున్నారు. దీని కారణంగా తల్లులు అవస్థలు పడుతున్నారు. వాహనాల కొరత, మరమ్మతుల కారణంగా ఈ సమస్య ఉందని డ్రైవర్లు వాపోతున్నారు.

ఐదు నెలలుగా వేతనం లేదు

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాల్లో పనిచేస్తున్న 31 మంది డ్రైవర్లకు నెలకు రూ.7,870 చొప్పున వేతనం చెల్లిస్తున్నారు. ఈ మొత్తం కూడా ఐదు నెలలుగా చెల్లించడం లేదు. బకాయిలు విడుదల చేయాలని ఇప్పటికే వారు పలుమార్లు ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. వేతనాలు రానికారణంగా కుటుంబ పోషణ కష్టంగా మారిందని డ్రైవర్లు వాపోతున్నారు.

మరమ్మతులు చేయిస్తాం

జిల్లాలో తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలు కొన్ని మరమ్మతులకు గురైనట్లు తెలిసింది. వాటికి మరమ్మతులు చేయించేలా చూస్తాం. తల్లీబిడ్డ సేవలకు ఎక్కడా ఇబ్బంది రాకుండా చూస్తున్నాం. ఫిర్యాదులు వస్తే వెంటనే స్పందిస్తున్నాం. డ్రైవర్ల భర్తీని త్వరలో చేపడుతాం. ఇందుకు దరఖాస్తులు కూడా ఆహ్వానిస్తున్నాం.

– అశోక్, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ జిల్లా కో–ర్డినేటర్, చిత్తూరు


● చిత్రంలో కనిపిస్తున్న ఏపీ39యూఏ7657 బండి వెనుకభాగంలో శబ్దం వస్తోందని నిలిపేశారు. ఈ బండి నిలిచిపోయి నెల రోజులవుతోంది. పరిశీలిస్తే క్రౌన్ ఆయిల్ లేదని గుర్తించారు. ఇంత వరకు క్రౌన్ ఆయిల్ రాలేదు. బండి కదలేదు. ఈ వాహనం ప్రస్తుతం చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో ఓ మూలన పెట్టేశారు.


● ఈ ఫొటోలో కనిపిస్తున్న ఏపీ39యూఏ7685 బండి కూడా నెలల తరబడి మూలన పడిఉంది. బ్యాటరీ లేకపోవడంతో రోడెక్కడం లేదు. దీనికి తోడు టైర్లు సైతం అరిగిపోయాయి. పట్టించుకునే వారు లేరు. తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ బండి ముందుకు కదలనంటోంది. ఈ బండి కూడా చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో ఓ మూలన ఉంది.


● ఈ ఫొటోలో ఉన్న ఏపీ39యూఏ7687 బండికి మూడు చక్రాలు మాత్రమే ఉన్నాయి. దీనికి నాలుగు చక్రాలు అవసరం ఉండగా.. ఒక చక్రం మాయమైంది. దీంతో కొన్ని నెలలుగా ఈ బండి నిలబడిన చోట దిష్టిబొమ్మలా ఉంది. జిల్లా ప్రభుత్వాస్పత్రిలోనే ఓ పక్కన పెట్టారు.

అక్రమాల 'ఉపాధి'!

- ప్రభుత్వ సొమ్మును దోచేస్తున్న దొంగ మస్టర్లు
- పేద కూలీల కడుపుకొడుతున్న కేటుగాళ్లు
- 10 నుంచి ఏఐ ఆధారిత ముఖ హాజరు
- కసరత్తు చేస్తున్న జిల్లా డ్వామా శాఖ అధికారులు


కనీస వసతులు లేక పనులు చేస్తున్న ఉపాధి కూలీలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో ఉపాధి హామీ నిధులను అడ్డంగా దోచేస్తున్నారు. కూటమి ప్రభుత్వ ప్రజాప్రతినిధులు తమ ముఖ్యఅనుచరులనే క్షేత్ర సహాయకులుగా నియమించుకున్నారు. బంధువులు, అనుచరుల పేరుతో నకిలీ మస్టర్లు సృష్టించి వారంవారం రూ.వేలల్లో లబ్ధిపొందుతున్నారు. కుప్పం నియోజకవర్గంలోని శాంతిపురం, గుడుపల్లి, కుప్పం, పలమనేరు నియోజకవర్గంలోని బైరెడ్డిపల్లి, వి.కోట, పూతలపట్టు నియోజకవర్గంలోని యాదమరి మండలాల్లో కేరళ, బెంగళూరు, చెన్నై, తిరుపతి, ముంబయి వంటి ప్రాంతాల్లో స్థిరపడినవారి పేర్లను పొందుపరిచి ఉపాధి నిధులను కాజేస్తున్నట్లు సమాచారం. జిల్లా డ్వామా అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే అక్రమదారులు సాంకేతికతకు బురిడీ కొట్టిస్తున్నారు.

ఆశయానికి తూట్లు

ఉపాధి పథకం కూటమి నేతలకు కల్పతరువుగా మారింది. అవినీతి, అక్రమాలు మితిమీరి పోతున్నాయి. సామాజిక తనిఖీల్లో తవ్వేకొద్దీ అక్రమాలు బయటపడుతున్నాయి. పథకంలో ఉన్న లొసుగులను ఆసరాగా చేసుకుంటున్న క్షేత్రస్థాయి సిబ్బంది, అధికారులు కొందరు నిధులను పక్కదారి పట్టిస్తున్నారు. చట్టప్రకారం దుర్వినియోగమయ్యే సొమ్మును రికవరీ చేయాల్సిన అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు.

దొంగ మస్టర్ల దందా

ఉపాధి హామీ పనుల్లో దొంగ మస్టర్ల దందా ఆగడం లేదు. చేయని పనులకు డబ్బులు తీసుకునే వారు కొందరైతే, ఎక్కువ మస్టర్లు చూపించి ప్రజాధనాన్ని లూటీ చేసేవారు మరికొందరు.

జిల్లా సమాచారం	
జాబ్ కార్డులు –	2,67,000
వేతనదారులు –	4,79,000
అవసరానికి అనుగుణంగా హాజరయ్యేవారు –	2-3 లక్షల మంది
రోజూ పనిచేస్తున్న కూలీలు –	35 వేల మంది

గత ఏడాదిగా అడ్డగోలు పనులకు అలవాటు పడిన కొందరు కూలీల పేర్లతో బోగస్ మస్టర్లు సృష్టించి స్వాహా చేస్తున్నారు. చేయని పనులకు సైతం రికార్డులు సృష్టించడం, యంత్రాలతో పనులు చేసి బిల్లులు పెట్టడం వంటివి సర్వసాధారణమైపోయాయి.

10 నుంచి ఏఐ ఆధారిత ముఖ హాజరు

నేషనల్ మస్టర్ మానిటరింగ్ (ఎన్‌ఎంఎంఎస్) ఆధ్వర్యంలో ఫేస్ అటెండెన్స్ ఉన్నప్పటికీ జిల్లాలో దొంగ మస్టర్లు వెలుగులోకి వస్తూనే ఉన్నాయి. వీటన్నింటికీ అడ్డుకట్ట వేయాలని కేంద్రం ఇటీవల నిర్ణయించింది. ఈ నెల 10వ తేదీ నుంచి జిల్లాలో ఏఐ ఆధారిత ముఖ హాజరు విధానాన్ని ప్రవేశపెట్టనుంది. ఈ మేరకు జిల్లా డ్వామా శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు.

అందరూ బాధ్యులే

క్షేత్రస్థాయిలో ఉపాధి హామీ పనుల్లో జరుగుతున్న అవినీతి, అక్రమాలకు ఆ శాఖ ఉన్నతాధికారులు సైతం బాధ్యత వహించాలనే వాదనలున్నాయి. పర్యవేక్షించాల్సిన అధికారులకు వాటాల రూపంలో ముడుపులు అందుతుండడంతో అటువైపు కన్నెత్తి చూడడం లేదు. నామమాత్రంగా కింది స్థాయి సిబ్బంది పై వేటు వేస్తున్నారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఉపాధి అక్రమాలపై మండల స్థాయిలో ఎంపీడీవోలు, ఏపీవోలు సైతం బాధ్యత వహించాలనే డిమాండ్లు వస్తున్నారు. కొందరు అధికారులు ఇష్టారాజ్యంగా బిల్లులు మంజూరు చేస్తూ.. అందినకాడికి దండుకోవడం పరిపాటిగా మారింది.


కలెక్టరేట్‌లోని డ్వామా కార్యాలయం

యంత్రాలతో పనులు చేస్తున్నారు



యంత్రాలతో ఉపాధి పనులు చేస్తున్నారు. జిల్లాలోని అనేక గ్రామాల్లో కూలీలు పనులు కావాలని అడుగుతున్నా పట్టించుకోవడం లేదు. యంత్రాలతో పనులు చేసేందుకు కూలీలకు పనులు ఇవ్వకుండా మోసం చేస్తున్నారు. వారం, వారం ఉపాధి కూలీలకు వేతనాలు ఇవ్వడం లేదు. ఉపాధి పనుల్లో జరుగుతున్న అవినీతి పై జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి వహించాలి.

– వాడ గంగరాజు, సీపీఎం జిల్లా కార్యదర్శి.

ద్రౌపదమ్మకు పట్టువస్త్రాల సమర్పణ


సారెతో ఊరేగింపుగా వస్తున్న మాజీ మంత్రి ఆర్కే రోజా

- అట్టహాసంగా పట్టువస్త్రాలు సమర్పించిన మాజీ మంత్రి ఆర్కే రోజా
- ఆలయ మర్యాదలతో సత్కరించిన నిర్వాహకులు

పుత్తూరు: ద్రౌపదీదేవి సమేత ధర్మరాజస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని పురస్కరించుకొని మాజీ మంత్రి ఆర్కే రోజా పట్టు వస్త్రాలు సమర్పించారు. ముందుగా బజారు వీధిలోని సెల్వ వినాయకస్వామికి పూజలు నిర్వహించారు. అనంతరం మంగళ వాయిద్యాలు, బాణ సంచా సందడి నడుమ ఊరేగింపుగా ఆలయానికి చేరుకొని సారె సమర్పించారు. స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం రోజాను ఆలయ నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రోజా మాట్లాడుతూ గత 11 ఏళ్లుగా అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్నానని తెలిపారు. అమ్మ ఆశీర్వాదంతోనే ఇలా ఏటా పట్టువస్త్రాలు సమర్పించడం జరుగుతోందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ హరి, వైస్ చైర్మన్లు శంకర్, జయప్రకాష్, ఎంపీపీ మునివేలు, వైస్ ఎంపీపీ మునస్వామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ, రూరల్ పార్టీ అధ్యక్షుడు ఏకాంబరం, అన్నాలోకనాథం, కౌన్సిలర్లు కె.రాధ, జయలక్ష్మి, భానుమతి, హేమలత, రాజేశ్వరి, రాధ, పవన్, గుణ, నాయకులు దిలీప్‌మొదలి, లోకనాథం, లారీమోహన్, మనోహర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, జయచంద్రన్, భాస్కర్‌యాదవ్, ఈశ్వరయ్యయాదవ్, గణేష్, చక్రపాణి, చిన్నా, ప్రసాద్, మురళీయాదవ్, వెంకటేశులు, శివలింగం, మీసాలురెడ్డి, కడియాలనాయుడు, లక్ష్మణమూర్తి, శివ, వెంకటేష్, బొజ్జయ్య, కిషోర్, తిరునావకర్సు, అపరంజి, గోవిందస్వామిరెడ్డి, రాంబత్తయ్య పాల్గొన్నారు.


ఆలయ మర్యాద అందుకుంటున్న మాజీ మంత్రి ఆర్కే రోజా

క్లుప్తంగా

కార్వేటినగరంలో తొలి సారిగా వరలక్ష్మీ వ్రతం

తిరుపతి అన్నమయ్యసర్కిల్: కార్వేటినగరంలోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో కొలువుతీరిన శ్రీమహాలక్ష్మి అమ్మవారి సన్నిధిలో తొలిసారిగా వరలక్ష్మీ వ్రతం ఈ నెల 8 తేదీన ఉదయం 10 నుంచి 12 గంటల వరకు నిర్వహించనున్నారు. ఈ మేరకు మంగళవారం టీటీడీ ముఖ్య ప్రజా సంబంధాల అధికారి పత్రికా ప్రకటన విడుదల చేశారు. వరలక్ష్మీ వ్రతంలో పాల్గొనదలచిన భక్తులు (ఇద్దరికి) రూ.500 చెల్లించి ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో ఆలయం వద్ద టికెట్లు పొందవచ్చు. వ్రతంలో పాల్గొన్న గృహస్తులకు ఉత్తరీయం, రవికె, లడ్డూ, అప్పం, బ్యాగ్, కుంకుమ, ప్రసాదం బహుమానంగా అందజేయనున్నారు.

6 నుంచి తెప్పోత్సవాలు

కార్వేటినగరంలోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకు తెప్పోత్సవాలు జరుగనున్నాయి. ఇందులో భాగంగా మొదటి రోజు 6వ తేదీన శ్రీ సీతాలక్ష్మణ సమేత శ్రీ కోదండ రామస్వామి, 7, 8వ తేదీల్లో రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామివారు సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8 గంటల వరకు తెప్పలపై విహరించి భక్తులకు దర్శనమిస్తారు. ఈ మూడు రోజులు ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు స్నపన తిరుమంజనం, సాయంత్రం 5 నుంచి 6.30 గంటల వరకు తిరువీధి ఉత్సవం నిర్వహిస్తారు.

ఫుడ్ కమిషనర్ తనిఖీలు



పలమనేరులో మధ్యాహ్నభోజనాన్ని పరిశీలిస్తున్న ఫుడ్ కమిషన్ సభ్యురాలు, డీసీఓ

పలమనేరు: పట్టణంలోని బాలికల గురుకుల పాఠశాల, పౌరసరఫరాలశాల గోడోన్‌ను రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యురాలు దేవీ గంజిమాల మంగళవారం తనిఖీ చేశారు. ఆమే రకు పట్టణ సమీపంలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడారు. వారికి అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. భోజన నాణ్యను పరిశీలించారు. పిల్లలతో కలిసి భోజనం చేశారు. ఆపై పక్కనే ఉన్న ఎఫ్‌సీ గోడోన్‌ను తనిఖీ చేసి అక్కడికి వచ్చిన బియ్యం నాణ్యతను పరిశీలించారు. ఆమె తనిఖీ చేసేచోట ముందుగానే ఆయా శాఖల అధికారులు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉండడంతో అన్నీ చాలా బాగున్నాయంటూ ఆమె కితాబిచ్చి వెళ్లిపోయారు.

నాణ్యమైన సరకులు అందించాలి

బంగారుపాళెం: నిత్యావసర సరుకులు నాణ్యమైనవిగా ఉండాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యురాలు గంజి మాలాదేవి సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని మహాసముద్రం గ్రామంలోని రేషన్‌దుకాణం, గుండ్లకట్టమంచి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బంగారుపాళెంలోని ఎస్టీ బాలుర రెషిడెన్షియల్ స్కూల్, ఎస్సీ బాలికల హాస్టల్‌ను ఆమె తనిఖీ చేశారు. రేషన్ దుకాణాల ద్వారా పేదలకు అందిస్తున్న సరకులు, పాఠశాలలు, హాస్టళ్లు, అంగన్వాడీ కేంద్రాలకు సరఫరా చేసే సరకులు నాణ్యవంతంగా ఉండాలన్నారు.

దేశ సౌభాగ్యానికి కలలు కనండి



మాట్లాడుతున్న ఐసర్ డైరెక్టర్ శాంతను భట్టాచార్య



ఐసర్ స్నాతకోత్సవంలో పట్టాలు పొందిన విద్యార్థులతో ఆ విద్యాసంస్థ డైరెక్టర్ శాంతను భట్టాచార్య

ప్రపంచం ఎదుర్కొంటున్న సవాళ్లపై పరిశోధనలు చేయండి

- ఐసర్ ఆరో స్నాతకోత్సవంలో పట్టభద్రులకు ముఖ్యఅతిథి పిలుపు
- అట్టహాసంగా స్నాతకోత్సవ సంబరాలు
- 255 మంది విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం

ఏర్పేడు: 'ఇన్నాళ్లూ తరగతి గదుల్లో పుస్తకాలతో కుస్తీ పట్టారు.. సైన్స్ ల్యాబ్‌ల్లో మెదడుకు పదును పెట్టి ఎన్నో ప్రయోగాలు చేశారు.. భావి శాస్త్రవేత్తలుగా బయటకు వెళుతున్న మీరంతా దేశ సౌభాగ్యం కోసం కలలు కనాలి. ప్రపంచం ఎదుర్కొంటున్న అనేక సవాళ్లపై పరిశోధనలు చేసి, పరిష్కారాలను కనుగొనాలి.' అని గోదావరి బయో రిఫైనరీస్ చైర్మన్ సమీర్ సోమయ్య పిలుపునిచ్చారు. ఏర్పేడు మండలం జంగాలపల్లి సమీపంలోని భారతీయ విజ్ఞాన శిక్షణ, పరిశోధన సంస్థ(ఐసర్) ఆరో స్నాతకోత్సవం డైరెక్టర్ ప్రొఫెసర్ శాంతను భట్టాచార్య అధ్యక్షతన ఘనంగా జరిగింది. ఐసర్ ఆడిటోరియంలో జరిగిన ఈ వేడుకను ఐసర్ బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ చైర్మన్ ఝిల్లుసింగ్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐసర్‌లో విద్యాభ్యాసం పూర్తి చేసుకున్న 255 మంది విద్యార్థులను పట్టాలతో సత్కరించారు. పట్టాలు అందుకున్న వారిలో 22 మంది పీహెచ్‌డీ విద్యార్థులు, 8 మంది ఐపీహెచ్‌డీ విద్యార్థులు, ముగ్గురు ఎంఎస్ విద్యార్థులు, 141 మంది బీఎస్–ఎంఎస్ విద్యార్థులు, 69 మంది ప్రొఫెషనల్ మాస్టర్స్ విద్యార్థులు, ఆరుగురు బీఎస్ విద్యార్థులు, మరో ఆరుగురు బీఎస్సీ డిగ్రీలు పూర్తి చేసిన విద్యార్థులున్నారు. ముఖ్య అతిథి గోదావరి బయో రిఫైనరీస్ లిమిటెడ్ చైర్మన్ సమీర్ సోమయ్య మాట్లాడుతూ భారతీయ వారసత్వం, శాస్త్రానికి సంబంధించి ధ్యానం చేయాలని పిలుపునిచ్చారు. ఆయిల్ ఆధారిత ఆర్థిక వ్యవస్థ నుంచి మట్టి ఆధారిత వ్యవస్థ వైపు మారాలన్నారు. వ్యవసాయ రంగంతో కలిసి యువ శాస్త్రవేత్తలు పని చేయాలని సూచించారు. ప్రతి వ్యక్తి తొలుత తల్లి నుంచే బోలుడంత విజ్ఞానాన్ని నేర్చుకుంటారని, వినడం, వివేచన, సాధన ద్వారానే సృజనాత్మకత పెంపొందుతుందన్నారు. మానవ జీవన విజ్ఞానంతోపాటు ప్రపంచంలోని అనేక జీవరాశులపై పరిశోధనలు చేయాలన్నారు. కాపీ ధోరణికి స్వస్తి పలికి, సొంత పరిజ్ఞానంతో పరిశోధనలు చేయాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ప్రకృతిని పరిరక్షించేలా పరిశోధనలు సాగాలని కోరారు. బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ చైర్మన్ ఝిల్లుసింగ్ యాదవ్ మాట్లాడుతూ కర్బన ఉద్గారాల్లో గ్రీన్ కర్బనాలపై మరిన్ని పరిశోధనలు చేయాలని కోరారు. ఇప్పటికే అనేక రంగాల్లో ఎన్నో సవాళ్లు ప్రపంచ వైజ్ఞానిక విధానానికి పెనుసవాళ్లుగా కనిపిస్తున్నాయని, వాటి పరిష్కారాలను వెతికే రీతిలో పరిశోధనలు సాగాలని కోరారు.

శాస్త్రీయ ప్రతిభ

2024–25లో 210 పరిశోధనా పత్రాలు ప్రచురించబడ్డాయన్నారు. రూ. 29.43 కోట్ల బహిరంగ పరిశోధన నిధులను పొందారని శాంతనుభట్టాచార్య వెల్లడించారు. నేచర్ ఇండెక్స్–2025 ప్రకారం తిరుపతి ఐసర్ దేశంలోనే 33వ స్థానంలో నిలిచిందన్నారు. స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ ప్రకటించిన ప్రపంచ ఉత్తమ రెండు శాతం శాస్త్రవేత్తల జాబితాలో ఎనిమిది మంది ఐసర్ ఫ్యాకల్టీ సభ్యులు చోటుదక్కించుకోవడం తమకెంతో గర్వకారణమన్నారు. కోవిడ్ సమయంలో ఉచిత పరీక్షల నిర్వహణలో కీలక పాత్ర పోషించామన్నారు. కార్యక్రమంలో ఐసర్ రిజిస్ట్రార్ ఇంద్రప్రీత్‌సింగ్ కోహ్లీ, లెఫ్ట్ కమాండర్ హిమాంశు శేఖర్, సీఎంఏ రమేష్ దామర్ల, వెంకటదీపక్, భానుశ్రీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆవిష్కరణకు పునాదిగా ఐసర్

సంస్థ డైరెక్టర్ ప్రొఫెసర్ శాంతను భట్టాచార్య మాట్లాడుతూ పరిశోధన, వైజ్ఞానిక ఆవిష్కరణలకు పునాది వేసేలా తిరుపతి ఐజర్‌ను తీర్చిదిద్దుతున్నామన్నారు. ప్రత్యేక శిల్పకళతో తీర్చిదిద్దిన ఐసర్ గ్రిహ కౌన్సిల్, టెరీ 4 స్టార్ రేటింగ్ ఇచ్చాయన్నారు. గ్రంథాలయం, ఆడిటోరియం వంటి భవనాల్లో భారతీయ, విదేశీ ప్రముఖ శాస్త్రవేత్తల పేర్లు చెక్కి ఉండటం విశేషమన్నారు.







పట్టాలు అందుకుంటున్న విద్యార్థులు

స్మార్ట్ మీటర్లు వద్దు

- వెంటనే రద్దు చేయండి
- వామపక్ష నాయకుల డిమాండ్



నిరసన తెలుపుతున్న సీపీఐ, సీపీఎం నాయకులు

చిత్తూరు కార్పొరేషన్: ఎన్నికల ముందు కరెంటు చార్జీలను పెంచబోమని హామీనిచ్చి గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం వాటిని అమలు చేయడం లేదని వామపక్ష నాయకులు విమర్శించారు. మంగళవారం స్థానిక గాంధీవిగ్రహం వద్ద సీపీఐ–సీపీఎం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శులు నాగరాజు, గంగరాజు మాట్లాడారు. విద్యుత్ చార్జీలు పెంచడం లేదంటూనే మరళా ట్రూఅప్ పేరుతో రాష్ట్రం పై మరో రూ.12,771 కోట్ల భారాన్ని మోపుతున్నారని దుయ్యబట్టారు. తక్షణం పెంచిన కరెంటు చార్జీలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. గత ఆర్థికలోటును సాకుగా చూపుతూ ఇష్టారాజ్యంగా కరెంటు బిల్లులు పెంచుకుంటూపోతున్నారని మండిపడ్డారు. సంవత్సర కాలానికి రూ.15,485 కోట్లు సర్దుబాటు చార్జీల భారం మోపారన్నారు. ఇదిగాక ప్రతినెలా యూనిట్‌కు రూ.40 పైసలు చొప్పున సంవత్సరంలోనే రూ.2,787 కోట్లు వసూలు చేశారన్నారు. స్మార్ట్ మీటర్ల వల్ల అదనపు భారం పడనుందని వాపోయారు. సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు 24న విద్యుత్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించి ధర్నా చేస్తామని పేర్కొన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో నాయకులు గిరిధర్ గుప్తా, దాసు, ఆనంద్, ప్రతాప్, శ్రీరాములు, గోపీనాథ్, దాసరి చంద్ర, రమాదేవి, విజయగౌరి పాల్గొన్నారు.

బాల్య వివాహాల కట్టడికి చర్యలు

- పలు శాఖల అధికారులతో వరుస సమావేశాలు
- పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా బాల్య వివాహాల కట్టడికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం పలు శాఖల జిల్లా అధికారులతో కలెక్టరేట్‌లో వరుస సమీక్షలు నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మిషన్ వాత్సల్య పథకంలో 18 ఏళ్ల లోపు పిల్లల రక్షణ, సంక్షేమం ప్రణాళిక ప్రకారం అమలు చేయాలన్నారు. జిల్లాలో అనాథ పిల్లలు, బాల కార్మికులు, భిక్షాటన చేస్తున్న పిల్లలను గుర్తించి వారిని పాఠశాలల్లో చేర్పించాలన్నారు. జిల్లాలో 8 నుంచి 10 శాతం చైల్డ్ ప్రెగ్నెన్సీ కేసులు నమోదవుతున్నాయన్నారు. అబార్షన్‌లు సైతం జరుగుతున్నాయన్నారు. బేటీ బచావో–బేటీ పడావో కార్యక్రమంలో సమస్యాత్మక ప్రాంతాల్లో ఎంఎస్‌కేల ఆధ్వర్యంలో అవగాహన కల్పించాలన్నారు.

ధైర్యం నింపాలి

జిల్లాలో పలు చోట్ల జరుగుతున్న పోక్సో, అత్యాచార బాధిత కుటుంబాల్లో ధైర్యం నింపాలని ఎస్పీ మణికంఠ చందోలు సూచించారు. తల్లిదండ్రులు కొంత మంది మైనర్లకు వివాహాలు చేస్తున్నారని, ఇలాంటి ఘటనలు జరుగుతున్న 180 ప్రాంతాలను సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తించామని చెప్పారు. కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలకు చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. 80కి పైగా ప్రభుత్వ బాలికల, మహిళల సంక్షేమ వసతి గృహాలు ఉన్నట్లు చెప్పారు. వాటిని సీసీ కెమెరాలతో ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఐసీడీఎస్ పీడీ వెంకటేశ్వరి, జెడ్పీ సీఈవో రవికుమార్‌నాయుడు, డీఈవో వరలక్ష్మి, జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి మూర్తి పాల్గొన్నారు.

21 మందికి మిషన్ వాత్సల్య సహకారం

కోవిడ్‌లో తల్లిదండ్రులను కోల్పోయిన 21 మంది పిల్లలకు మిషన్ వాత్సల్య పథకంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకారం అందిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. కోవిడ్‌లో తల్లిదండ్రులను కోల్పోయిన 21 మంది పిల్లలకు జిల్లా యంత్రాంగం అండగా ఉంటుందన్నారు. ఈ పథకంలో ఒక్కొక్కరికీ రూ.20 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. లబ్ధిపొందిన విద్యార్థులకు నగదు జమ చేసిన పోస్ట్ ఆఫీస్ పాస్ పుస్తకాలను అందజేశారు.

పీఎం సూర్యఘర్ పథకాన్ని చేరువ చేయండి

జిల్లాలోని ప్రజలకు పీఎం సూర్యఘర్ పథకాన్ని చేరువ చేసేలా సంబంధిత శాఖల అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. పీఎం సూర్యఘర్ పథకాన్ని ప్రజలకు చేరువ చేసేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. పీఎం సూర్యఘర్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్స్ ఎక్కువ సంఖ్యలో నమోదయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. పోర్టల్‌లో నమోదయ్యే దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. కుప్పం డివిజన్‌లోని ఫీడర్ స్థాయి సోలారైజేషన్ మొత్తం సామర్థ్యం 141 ఎంవీకి గాను 705 ఎకరాల భూమి అవసరమన్నారు. ఈ ప్రాజెక్టుకు 400 ఎకరాల భూమిని గుర్తించి మెగా ఇంజినీరింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్‌కు ప్రాజెక్టును అప్పగించినట్టు వెల్లడించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ విద్యాధరి, ఏపీఎస్‌పీడీసీఎల్ డైరెక్టర్ అయూబ్‌ఖాన్, ప్రాజెక్ట్ సీజీఎం రమాదేవి, రెస్కో ఎండీ సోమశేఖర్ అధికారులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవం..బ్రహ్మాండంగా జరిపిద్దాం

- ఈనెల 27 నుంచి కాణిపాక బ్రహ్మోత్సవం
- జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ మణికంఠ చందోలు



మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే

కాణిపాకం: బ్రహ్మోత్సవం బ్రహ్మాండంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్, ఎస్పీ మణికంఠ చందోలు పిలుపునిచ్చారు. కాణిపాకంలోని శ్రీ వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం ఈవో కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం అన్ని శాఖల అధికారులతో రివ్యూ నిర్వహించారు. ఈ నెల 27 నుంచి ప్రారంభమయ్యే బ్రహ్మోత్సవ నిర్వహణపై శాఖల వారీగా చర్చించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 27 నుంచి సెప్టెంబర్ 16వ తేదీ వరకు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగుతాయన్నారు. రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ, వైద్య ఆరోగ్య శాఖ, ఇతర సంబంధిత శాఖలు సమన్వయంతో అవసరమైన ఏర్పాట్లకు సంబంధించి ఆలయ ఈఓ అధ్యక్షతన సమన్వయ కమిటీ ఏర్పాటు చేశామన్నారు. ఈ కమిటీ ద్వారా ప్రాథమిక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలన్నారు. ఆలయం లోపల విద్యుత్ సౌకర్యం లోటుపాట్లపై ముందస్తు పరిశీలన చేయాలన్నారు. కాణిపాక నగరంలో మొబైల్ టాయ్‌లెట్లు ఏర్పాటు చేయాలని, భక్తులకు సురక్షితమైన తాగునీరు అందజేయాలన్నారు. ఆలయ ఉభయదారులతో మంచి సంబంధాలు కలిగి ఉండాలని అధికారులను ఆదేశించారు. ఎస్పీ మాట్లాడుతూ ఆరు రోజుల్లో పటిష్ట బందోస్తు ఉంటుందన్నారు. మిగతా రోజుల్లో అవసరం మేరకు బందోబస్తు చేస్తామన్నారు. సీసీటీవీల ద్వారా నిరంతర పర్యవేక్షణ ఉంటుందన్నారు. హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసి.. కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా 24/7 పర్యవేక్షిస్తామన్నారు. ఎమ్మెల్యే మురళీమోహన్ మాట్లాడుతూ సాధారణ రోజుల్లోనే ఆలయంలో తప్పిదాలు జరుగుతున్నాయన్నారు. విరిగిన పాలు విషయం సీఎం వరకు వెళ్లిందని చెప్పారు. సిబ్బంది నిర్లక్ష్యం కనిపిస్తోందన్నారు. వారి విధుల్లో నిర్లక్ష్యం లేకుండా అధికారుల నిరంతర పర్యవేక్షణ ఉండాలన్నారు. కాణిపాక ఆలయ ఈవో పెంచల కిషోర్, అడిషనల్ ఎస్పీ ఎస్.ఆర్.రాజశేఖర రాజు, ఆర్డీవో శ్రీనివాసులు, డీఎంఅండ్‌హెచ్ఓ సుధారాణి, డీపీటీఓ రాము, డీఎస్పీ సాయినాథ్, సీఐ శ్రీధర్‌నాయుడు పాల్గొన్నారు.

బెల్టు షాపు నిర్వాహకుడి అరెస్ట్



నిందితుడితో పోలీసులు

వెదురుకుప్పం: మండలంలోని దేవళంపేటలో బెల్టు షాపు నిర్వహిస్తున్న వ్యక్తిని మంగళవారం వెదురుకుప్పం పోలీసులు అరెస్టు చేశారు. ఎస్ఐ వెంకటసుబ్బయ్య కథనం మేరకు.. దేవళంపేటకు చెందిన రఘునాథరెడ్డి కుమారుడు కిరణ్‌బాబు(48) అక్రమంగా బెల్టు షాపు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో మంగళవారం సాయంత్రం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 40 మద్యం బాటిళ్లు పట్టుబడడంతో వాటిని సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. కాగా నిందితుడ్ని అదుపులోకి తీసుకున్నట్టు పేర్కొన్నారు.

ఏడాది అవుతున్నా నేరవేరని హామీలు



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు శివయ్య

చిత్తూరు కలెక్టరేట్ : కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయినా ఇప్పటి వరకు ఉద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడం అన్యాయమని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు శివయ్య ఆరోపించారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో ఆ సంఘం ఆధ్వర్యంలో 'రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది అయినా ఇంకా ఉద్యోగుల సమస్యలపై స్పందించకపోవడం ఆవేదన కలిగిస్తోందన్నారు. ఇప్పటికే ఉద్యోగులకు సుమారు రూ.25 వేల కోట్ల ప్రభుత్వ బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాలను ఇళ్ల స్థలాల రూపంలో ఉద్యోగులకు ఇచ్చి వారికి ఇవ్వాల్సిన బకాయిలను జమచేసుకోవాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉద్యోగులు తమ సంఘం దృష్టికి సమస్యలను తీసుకొస్తే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నరేష్‌బాబు, కోశాధికారి దేవకుమార్, అసోసియేట్ ప్రెసిడెంట్ బాలాజీరెడ్డి, సంయుక్త కార్యదర్శులు హరిప్రసాద్, మనోజ్, గౌరీశంకర్, కమర్షియల్ ట్యాక్స్ జిల్లా అధ్యక్షులు పూర్ణం, కార్యదర్శి గిరి, మహిళా విభాగం జిల్లా కార్యదర్శి శైలజ, సౌజన్య, విజయ పాల్గొన్నారు.

అల్లుడి చేతిలో హతం



రాందాస్ మృతదేహం

కుప్పం: ఏడు నెలలుగా భార్యను కాపురానికి పంపలేదన్న కోపంతో సొంత మామను హతమార్చిన ఘటన కుప్పం పట్టణంలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు కథనం మేరకు.. తమిళనాడు రాష్ట్రం కృష్ణగిరికి చెందిన రాజ్‌కుమార్ కుప్పం పట్టణం కొత్తపేటకు చెందిన మహిళతో వివాహం జరిగింది. వీరిద్దరికి రెండు నెలల ఆడబిడ్డ ఉంది. ప్రసవం కోసం వచ్చిన తన భార్యను కాపురానికి పంపాలని రాజ్‌కుమార్ అత్త లక్ష్మి, మామ రాందాస్‌ను అడుగుతూ వచ్చారు. కానీ రాందాస్ తన భార్యను కాపురానికి పంపకుండా కుటుంబంలో కలహాలు సృష్టిస్తున్నాడని రాజ్‌కుమార్ తరుచూ గొడవ పడేవాడు. మామాఅల్లుళ్లు ఇద్దరూ కలసి మద్యం సేవించే అలవాటు ఉండేది. ఈ క్రమంలో మంగళవారం మధ్యాహ్నం కుప్పంలోని ఓ మద్యం షాపులో మద్యం తీసుకుని కమతమూరు సమీపంలోని పొలాల్లో కూర్చుని తాగడం ప్రారంభించారు. ఆ సమయంలో తన భార్యను కాపురానికి పంపలేదని అడుగుతున్న సమయంలో వివాదం పెద్దదై, మద్యం మత్తులో రాజ్‌కుమార్ తన మామ రాందాస్ తలపై రాతిలో బలంగా కొట్టాడు. దీంతో రాందాస్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



చినుకు.. వణుకు

చిత్తూరు నగరంలో చిన్నపాటి వర్షం పడితే చాలు స్థానికులు బయటకు రావాలంటే భయపడిపోతున్నారు. నగరంలో కాలువలు ఆక్రమణకు గురవడం, మురుగునీటి కాలువల నిర్వహణ అంతంత మాత్రంగా ఉండడంతో వర్షం పడ్డ ప్రతిసారీ పలు ప్రధాన రహదారులు మురుగునీటితో నిండిపోతున్నాయి. మంగళవారం రాత్రి కురిసిన ఓ మోస్తరు వర్షానికి ఎంఎస్ఆర్ కూడలి, డీఐ రోడ్డు, వెంగళరావు కాలనీ, సీఎంటీ రోడ్డు, రీడ్స్‌పేట, ఓటీకే రోడ్డు, గాంధీ రోడ్డు కూడలి తదితర ప్రాంతాలు మురుగునీటితో మునిగిపోయాయి. వాహనదారులు..పాదచారులు నానా తిప్పలు పడాల్సి వచ్చింది. - చిత్తూరు అర్బన్

పలమనేరులో మహిళ దారుణ హత్య!

- బట్టలు లేకుండా నీటిగుంతలో మృతదేహం
- లైంగికదాడి చేసి చంపేశారనే అనుమానాలు





నీటి గుంతలో తేలియాడుతున్న మహిళ మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ నరసింహరాజు

పలమనేరు: పట్టణ సమీపంలోని ఎక్స్‌ప్రెస్‌హైవే పనులు సాగుతున్న ప్రాంతంలో ఓ మహిళ దారుణ హత్యకు గురైంది. ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు లైంగిక దాడి చేసి.. ఆపై హత్య చేసినట్టు తెలుస్తోంది. స్థానికుల కథనం.. పట్టణ సమీపంలోని ఆంజినేయస్వామి ఆలయానికి వెనుకవైపు ఎక్స్‌ప్రెస్ హైవే రోడ్డు పనులు జరుగుతున్నాయి. ఈ నిర్మాణానికి మట్టి తవ్వకాలు చేపట్టారు. ఇటీవల ఆ గుంతల్లో వర్షపునీరు చేరింది. ఓ గుంతలో 30 ఏళ్ల వయసు కలిగిన మహిళ మృతదేహం ఉన్నట్టు స్థానికులు గుర్తించి మంగళవారం పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ నరసింహరాజు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. నీటిలో తేలియాడుతున్న మహిళ ఒంటిపై ఎలాంటి దుస్తులు లేవు. ఆపై మృతదేహాన్ని వెలికితీసి గమనించగా ముఖంపైన, శరీరంపై పలుచోట్ల రక్తగాయాలు కనిపించాయి. ఆ ప్రదేశానికి పైన గుంత ఒడ్డున ముళ్లపొదలపై మృతురాలి పాదరక్షలు, నైటీ, లోదుస్తులు కనిపించాయి. ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు ఆమెపై లైంగిక దాడి చేశారా..? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇదే పోలికలున్న మహిళ కొన్నాళ్లుగా ఈ ప్రాంతంలో తచ్చాడుతూ ఉండేదని కొందరు చెబుతున్నారు. ఆమెకు మతి బాగోలేదని మరికొందరు అంటున్నారు. ఏది ఏమైనా ఘటన జరిగి మూడురోజులైంటుదని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. సీఐ మాట్లాడుతూ అనుమానాస్పద కేసుగా నమోదు చేశామన్నారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా కేసు నమోదు చేసి విచారిస్తామని చెప్పారు.





ఘటనా స్థలం పక్కన ఉన్న మృతురాలి పాదరక్షలు, దుస్తులు

ప్రలోభాలకు గురిచేసే నైజం వైఎస్సార్‌సీపీకి లేదు

- మీడియా సమావేశంలో వైఎస్సార్‌సీపీ నేతల వెల్లడి
- స్వతహాగా వస్తే పార్టీలో చేర్చుకున్నాం
- కూటమి పాలన తీరును చూసి తమ వైపు ఆకర్షితులవుతున్నారు



మాట్లాడుతున్న పార్టీ మండల అధ్యక్షుడు నాగభూషణరెడ్డి, పక్కన వైస్ ఎంపీపీ సుధాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రుక్మిణమ్మ

చౌడేపల్లె: ఇతర పార్టీల నుంచి కార్యకర్తలను ప్రలోభాలు పెట్టి తమ పార్టీలోకి రప్పించుకునే నైజం వైఎస్సార్‌సీపీకి లేదని మండల పార్టీ అధ్యక్షుడు జి.నాగభూషణరెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం పెద్దకొండామర్రిలో వైస్ ఎంపీపీ సుధాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రుక్మిణమ్మ, మండల పార్టీ ఉపాధ్యక్షుడు వెంకటరమణ, మాజీ సింగిల్‌విండో చైర్మన్ రవిచంద్రారెడ్డి, పార్టీ నేతలతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. నాగభూషణరెడ్డి మాట్లాడుతూ ఇటీవల మండలంలో ఐదు రోజులపాటు బాబు షూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని చేపట్టామని, కూటమి ప్రభుత్వం ప్రజలకు చేసిన మోసాన్ని వివరిస్తూ చైతన్యం తెచ్చామని చెప్పారు. చివరి రోజైన ఆదివారం శెట్టిపేట పంచాయతీ తోటకురప్పల్లెకు చెందిన టీడీపీ నాయకుడు ఎస్. కుమార్‌రాజు స్వతహాగా నడుమూరులో జరుగుతున్న బాబు షూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్నారని, అక్కడే పార్టీ నేతల ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ కండువాను వేసి కుమార్‌రాజును స్వాగతించినట్లు తెలిపారు. మరుసటిరోజు ఆ పార్టీకి చెందిన నేతలు కొందరు కుమార్‌రాజు ఇంటికెళ్లి మళ్లీ టీడీపీలోకి చేర్చుకున్నట్లు పత్రికల ద్వారా తెలిసిందన్నారు. ప్రలోభాలకు గురిచేసి కుమార్‌రాజును పార్టీలోకి చేర్చుకున్నట్టు వచ్చిన ప్రచారం చేయడం దుర్మార్గమన్నారు. అలాంటి సంస్కృతి తమ పార్టీకి లేదని గుర్తుచేశారు. సమావేశంలో సర్పంచులు జయసుధమ్మ, షంషీర్, ఓబుల్‌రెడ్డి, రఘునాథరెడ్డి, కో–ఆప్షన్ మెంబరు సాధిక్‌బాషా, చెంగారెడ్డి, పార్టీ ఉపాధ్యక్షుడు అమర, నాయకులు సుబ్రమణ్యంరాజు, శంకరప్ప, రవికుమార్‌రెడ్డి, వెంకటేష్ రాజు, ప్రభాకర్, హనుమంతురెడ్డి, శంకర్‌రెడ్డి, కృష్ణప్ప, వెంకటరమణ, మురళి తదితరులు పాల్గొన్నారు.